క్లుప్తంగా

3 నుంచి మహదేవపట్నంలో సువార్త సభలు

ఉండి: మండలంలోని మహదేవపట్నం రామచంద్రాపురంలో షాలోమ్ రక్షణ సువార్త మందిరం ఆధ్వర్యంలో వచ్చే నెల 3,4 తేదీల్లో 31వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని కృపా సువార్త పండుగలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ రెవరెండ్ ఆర్ జెకర్యా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభించే ఈ పండుగల్లో బ్రదర్ సుందర్‌సింగ్(అక్కిరెడ్డిగూడెం),బ్రదర్ టీ డేవిడ్ ప్రాన్సిస్(నిడదవోలు) హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణాన్ని పరిరక్షించాలని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యదర్శి నందమూరి రాజేష్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. రాజేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతోనే చాలా మంది జీవనం సాగిస్తున్నారని, మార్పు అనేది త్వరగా రావాలని కోరారు. ప్రచార కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భక్తులుగా ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ సంచులనే వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు మల్లేశ్వరరావు, గోపిశెట్టి కృష్ణ, కెప్టెన్ శేఖర్, సత్యసాయి సేవా సమితి సభ్యులు రాయప్రోలు చలపతి, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన కేతా కనకారాజు (64) ఈ నెల 22న ఆర్థిక బాధలు తాళలేక పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతనిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఉన్నత వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం చనిపోయాడు. ఈ మేరకు మృతుని కుమారుడు కేతా నాని ఇచ్చిన సమాచారం పై బుధవారం కేసు నమోదు చేసినట్లు యలమంచిలి ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు.

డోలు కళాకారుడికి సన్మానం



ఇలపకుర్తి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

యలమంచిలి: గుమ్ములూరు గ్రామానికి డోలు కళాకారుడు ఇలపకుర్తి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులను దిగమర్రు వీరభద్ర స్వామి కమిటీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన హార్మోనియం కళాకారుడు తమ్మా శివ కోట మార్లింగం, కోటలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలోని శివాలయంలో శ్రీనివాస్‌కు రజత కంకణాన్ని మార్లింగం తొడిగారు. అనంతరం శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులకు నూతన వస్త్రాలు, శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మేడిచర్ల వెంకట రామారావు, వీరా కోట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఆయా పనులు లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్‌పాత్రుడు, శానిటరీ మేస్త్రి కిషోర్, నరేష్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా ప్రభల సంబరం



సిద్ధాంతంలో ప్రభల సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం సాలిపేటలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి శివరాత్రి ప్రభల సంబర మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీ స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఐశెట్టి సుబ్రహ్మణ్యం, హేమ నాగమణి దంపతులతో శ్రీ వీరభద్ర స్వామి వారి ప్రభకు విభూది తాంబూలం కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఇరగవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుణ్ణం నాగమణి తెలిపారు. తణుకు జోన్ స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిసాయి. ఈ పోటీల్లో తణుకు, అత్తిలి, ఇరగవరం మూడు మండలాల్లో క్రీడాకారులు కబడ్డీ, వాలీబాలు, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ఆకివీడు: సాలిపేటలోని మహాశివుడికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు



భీమవరంలో ఉమా సోమేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న అర్చకులు

భీమవరం(ప్రకాశం చౌక్): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భీమవరంలోని శివాలయాలన్నీ కూడా బుధవారం భక్త జనంతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే పరమ శివుడ్ని దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాలకు తరలివచ్చారు. దీంతో ఆయా శైవ క్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మారుమ్రోగాయి.

పోలీసులు విఫలం

భక్తులను క్యూలైన్లలో పంపించడంలో పోలీసులు విఫలమయ్యారు. అంతరాలయ దర్శనానికి వెళ్లేందుకు మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఉత్సవాల ముందు జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఏర్పాట్లపై ఇచ్చిన సూచనలు, సలహాలను పోలీసులు పాటించలేదనే విమర్శలు వచ్చాయి. టికెట్ కొన్న భక్తులు ఎండలో క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండటం కనిపించింది.

స్వామివారికి ప్రత్యేక పూజలు

శివరాత్రి పురస్కరించుకుని ఉమాసోమేశ్వర స్వామికి బుధవారం తెల్లవారి జాము నుంచే సాయంత్రం వరకు రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు చేకూరి రామకృష్ణ, కందుకూరి సోంబాబు ఆధ్వర్యంలో సాయంత్రం స్వామివారికి లక్షపత్రి పూజ, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో పార్వతి సమేత శక్తీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల సత్యనారాయణ, కొండమంచిలి తమ్మిరాజులు శక్తీశ్వరస్వామికి సహస్రనామార్చన, పంచామృత అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కొంతమంది మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో విఘ్నేష, గౌరి, శని, వరలక్ష్మీ పూజ, పసుపు, కుంకుమలతో సామూహికంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్య కలగకుండా ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కర్రి శ్రీనివాసరావు, పినిశెట్టి నాగేశ్వరరావులు పర్యవేక్షించారు.



భీమవరంలో అంతరాలయం దర్శనం కోసం క్యూలైన్‌లో నలిగిపోతున్న భక్తులు



భీమవరంలో శివయ్య దర్శనానికి ఎండలో నిలుచున్న భక్తులు

దిరుసుమర్రులో

మండలంలోని దిరుసుమర్రులో గ్రామంలో స్వయంభూ గంగా భ్రమరాంభిక సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ అల్లూరి బంగార్రాజు, కలిదిండి పేర్రాజు, మైగాపుల గంగారామ్, ఇళ్ల బాబు, నక్కా రామోజీ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మండలంలో చినఅమిరం, రాయలం, గొల్లవానితిప్ప, బేతపూడి తదితర గ్రామాలలో శివాలయాలకు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శివునికి ప్రత్యేక అభిషేకాలు

వీరవాసరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన వీరవాసరంలో వీరేశ్వర,విశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ, రాయకుదురులో బాలా త్రిపుర సుందరి సమేత సకల సుందరేశ్వర స్వామి ఆలయంలోనూ, శ్రీ ఉమామూలేశ్వర స్వామి ఆలయంలోనూ, పోలేరులో శ్రీ రుద్రేశ్వర స్వామి ఆలయంలోనూ, కొనితివాడలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ ,నవుదూరు, చింతల కోటి గరువు, పంజా వేమవరం, మడుగు పోలవరం, మత్యపురి అండలూరు, పెరికిపాలెం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాయకుదురు లింగాకారం సెంటర్లో సకల సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి బజార్ సెంటర్లో ఉమా మూలేశ్వరస్వామి వారి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా దీపాలను పెద్ద ఎత్తున పెట్టి దీపోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. అనంతరం లింగాకారం సెంటర్లో అల్పాహార విందును ఏర్పాటు చేశారు.

శివాలయాల్లో భక్తుల కిటకిట

ఆకివీడు: ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేవిధంగా పరమేశ్వరరుడు కరుణించాలని కోరుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక సాలిపేటలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి 55వ శివరాత్రి మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వార్లకు పీవీఎల్ పట్టు వస్త్రాలను తీసుకువచ్చి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అగస్త్యేశ్వరస్వామి ఆలయంను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల మర్యాదలతో పీవీఎల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్ పుప్పాల పండు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, మంతెన సునిల్ వర్మ, కేశిరెడ్డి మురళి, యర్రా కేశవరావు, తిప్పా దుర్గా భవానీ, బండారు వెంకటరత్నంనాయుడు, కేశిరెడ్డి దిలీప్ తదితరులు పాల్గొన్నారు. వీరభద్ర స్వామిని సీనియర్ నాయకులు కనుమూరు అబ్బాయిరాజు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మార్కండేయునికి సహస్ర ఘట్టాభిషేకం

మహా శివరాత్రి సందర్భంగా శివాలయాల్లో మహా కుంభాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్షలతో ఏకలింగానికి సహస్ర ఘటాభిషేకాలు సువాసినిలు, కన్యలు నిర్వహించారు. 1000 లీటర్ల ఆవుపాలు, సుగంధ ద్రవ్యాలు కలిపిన 1008 కలశాలతో అభిషేకాలను అత్యంత వైభవోపేతంగా చేశారు. లోక కల్యాణార్థం శ్రీసూక్త హోమం, లక్ష బిల్వార్చన, లక్షకుంకుమార్చన, లక్ష దీపారాధన, అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గొంట్లా గణపతి, కాకర్ల రాజరాజేశ్వరి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో 3 వేల మందికి అఖండ అన్నసమారాధన చేశారు. స్థానిక ధార్మపుర అగ్రహారం, సిద్ధాపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, మాదివాడలోని మల్లేశ్వరస్వామి, వేంకట లింగేశ్వరస్వామి, అయిభీమవరంలోని అమృతలింగేశ్వరస్వామి, పలు శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణల్లో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

కాళ్లలో..

కాళ్ల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కాళ్ల మండలంలోని శివాలయాలు బుధవారం తెల్లవారుజాము నుండి భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా కాళ్ల, ఏలూరుపాడు, దొడ్డనపూడి, కలవపూడి, కాళ్ళకూరు, బొండాడ, పెదఅమీరం, కోపల్లె, జువ్వలపాలెం, కోలనపల్లి, సీసలి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. శివయ్య దర్శనం కోసం భక్తులు క్యూలైన్ లో గంటలతరబడి నిలబడి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. కోలనపల్లి, సీసలి, కలవపూడి గ్రామాల్లో శివరాత్రి వేడుకలు పురస్కరించుకొని అఖండ అన్న సమారాధనలు నిర్వహించారు.

ఉండిలో..

ఉండి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. బుధవారం వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. మండలంలోని కలిసిపూడి, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, మహదేవపట్నం, ఉప్పులూరు, యండగండి, కోలమూరు, చెరుకువాడ, ఆరేడు తదితర గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కలిసిపూడిలోని స్వయంభూ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయానికి మునుపెన్నడూ లేని విధంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు సర్పంచ్ కేశబోయిన శ్రీనివాసరావు, మందపాటి సూర్యనారాయణ, శివ తదితరులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 10న అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామని సర్పంచ్ శ్రీనివాసరావు తెలిపారు.



కాళ్ల: శివయ్య దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



భీమవరం(ప్రకాశం చౌక్): భీమేశ్వర స్వామికి అభిషేకాలు



ఉండి: కలిసిపూడిలో మల్లికార్జునుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఆకివీడు: లక్ష రుద్రాక్షలతో ఏకలింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కాళ్ల: ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాళ్ల తహసీల్దార్ జి.సుందర్ సింగ్ బుధవారం తెలిపారు. కాళ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాళ్ళ మండలంలో మొత్తం 1465 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ఉమ్మడి తూర్పు ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు ఎన్నికల పరిశీలన అధికారి, మండల తహసిల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి తెలిపారు. మండలంలో మొత్తం 2370 మంది పట్టబద్రులు ఓటు హక్కును కలిగి ఉన్నట్లు, వారందరూ ఓటును వినియోగించుకునే విధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 402,403,404 నెంబర్లలో పోలింగ్ బూతులు ఏర్పాటు చేసినట్లు, ఇప్పటికే సంబంధిత ఎన్నికల సిబ్బంది, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిమిత్తం తగినంత పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. గురువారం ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయన్నారు.

ఉండిలో..

ఉండి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక్కడ రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సామగ్రితో పోలింగ్ సిబ్బంది బుధవారం కేంద్రాలకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వుండేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కాళ్ల: ఎన్నికల ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

భీమవరం అర్బన్: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ రావి రాంబాబు బుధవారం తెలిపారు. భీమవరంలో పొట్టి శ్రీరాములు మునిసిపల్ గర్ల్స్ హై స్కూల్‌లో పడమర వైపున రూమ్ నెం.8,9,14,15, మహాత్మాగాంధీ మెమోరియల్ ఎలిమెంట్రీ స్కూల్‌లో దక్షిణ వైపున గది, లూథరన్ హైస్కూల్‌లో ఉత్తరం వైపున ఉన్న రూమ్ నెం.2,4,5,6, చింతల పాటి బాపిరాజు మెమోరియల్ హై హైస్కూల్‌లో తూర్పు వైపున రూమ్ నెం. 12,14,15, డైనింగ్ హాల్ రూమ్‌లను పోలింగ్ స్టేషన్‌లు మొత్తం 13 కేటాయించామన్నారు. వీటి పరిధిలో 10 వేల 6వందల 55 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు మైక్రో అబ్జర్వర్ ఉండటంతో పాటు పోలింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తారని చెప్పారు. ఓటర్లు ప్రభుత్వం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డులో ఏదో ఒకటి తీసుకువెళ్లాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 35 మంది అభ్యర్థులకు సంబంధించి బ్యాలెట్ పేపర్‌పై ప్రాధాన్యత క్రమంలో ఓటింగ్ జరుగుతుందన్నారు.

చిరు వ్యాపారులు, పేదలపై ఎమ్మెల్యే ప్రతాపం

ఉండి: ఉప సభాపతి, నియోజకవర్గ ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు పేద ప్రజలు, చిరు వ్యాపారులపైనా ప్రతాపం చూపించడం దుర్మార్గమని సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ మండిపడ్డారు. బుధవారం ఉండి సెంటర్‌లోని సీపీఎం కార్యాలయాన్ని కూల్చివేసిన ప్రాంతాన్ని సీపీఎం మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో ఆయన పరిశీలించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉండిలో అభివృద్ధి చేస్తున్నానని చెప్పుకుంటూ ప్రజలు,చిరు వ్యాపారులపై స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ప్రతాపం చూపిస్తున్నారని మండిపడ్డారు. నిస్వార్థంగా ఆక్రమణల తొలగింపు చేస్తుంటే బడా బాబుల ఆక్రమణలైన బంధరు వుంతను స్వాధీనం చేసుకుని ప్రభుత్వపరం చేయాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించుకుంటే ముందుగా వారికి నోటీసులిచ్చి గడువు లోగా ఖాళీ చేయకపోతే అప్పుడు అధికారులు చర్యలు చేపట్టవచ్చును కానీ తమకు ఎటువంటి నోటీసులు గాని గడువు గానీ ఇవ్వకుండా జేసీబీని తెచ్చి తమ కార్యాలయాన్ని కూల్చడం ఎమ్మెల్యే నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. భీమవరంలో గొట్టు ముక్కల సత్యనారాయణరాజు అనే వ్యక్తికి చెందిన భవంతిని తొలగించాలని అధికారులు మార్కింగ్ చేయగా దానిని ఇప్పటికీ తొలగించకుండా ఉండడం చూస్తుంటే అధికారులు కేవలం నిరుపేదల పైనే ప్రతాపం చూపిస్తూ బడాబాబులకు ఊడిగం చేస్తున్నట్లు తేటతెల్లమవుతుందన్నారు. రామకూరి వెంకటరత్నం, కొట్టాడ వెంకటేశ్వరరావు, చీర్ల శ్రీనివాస్, మోపిదేవి రాము పాల్గొన్నారు.



సీపీఎం కార్యాలయం కూల్చివేతపై ఉండి సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

వీరవాసరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు జుత్తిగ నరసింహమూర్తి పేర్కొన్నారు. బుధవారం సీపీఎం సమావేశం వీరవాసరం పార్టీ ఆఫీసులో పోతుల మృత్యుంజయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రజలకు చేసిన ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా పేదల ఇళ్లను కూల్చడం సరి కాదన్నారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ మాత్రం వాయిదాల మీద వాయిదాలు వెయ్యటాన్ని విమర్శించారు. ప్రజలకు అండగా ఉంటున్న ప్రజా పోరాటాలు చేస్తున్నందు వల్ల కక్ష కట్టి ఉండి సీపీఎం కార్యాలయం కూల్చివేసినంత మాత్రాన ప్రజా పోరాటాలు ఆగవని అన్నారు. ఈ సమావేశంలో బాలం విజయకుమార్, లింగం సత్యనారాయణ, తాళ్లూరు రాము, కేత జ్యోతిబాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జుత్తిగ నర్సింహమూర్తి

రాయకుదురులో చెడుగుడు పోటీలు



రాయకుదురులో చెడుగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

వీరవాసరం: క్రీడల ద్వారా మానసిక ఉత్తేజం కలుగుతుందని రాయకుదురు గ్రామ సర్పంచ్ గెద్దం భారతి తెలిపారు. రాయకుదురు శివారు జగన్నాథరావు పురంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటల పోటీల వలన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధికి పాటుపడి మంచి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. క్రీడాకారులు, క్రీడా అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను విజయవంతం చేయాలని కోరారు. క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి ,ఎంపీటీసీ కడలి నెహ్రూ, సీటి సంఘం అధ్యక్షుడు తోట ఆది బాబు, పంపన రామానంద్ సాగర్, కడలి వాసు ,తోట విజయ్ కుమార్ ,కడలి శ్రీనివాసు, ఆకుల బాలరాజు, క్రీడాకారులు, క్రీడా అభిమానులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం సందర్భంగా సాయంత్రం 4.00 గంటల నుంచి రాత్రి 9.00గంటల గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. నాచువరి సెంటర్, బేతనిపేట, రాజీవ్ గాంధీ బొమ్మ వీధి, నల్ల వారి వీధి, నల్లం వారి తోట, అంబేడ్కర్ నగర్, బ్రిడ్జిపేట, గొల్లంకి వారి వీధి ,కందిగట్ల వారి వీధి , గరువు పేట ఏరియాలకు సరఫరా ఉండదన్నారు. అదే విధంగా 28వ తేది శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి 11:00 వరకు నాచు వారి సెంటర్, ముస్లిం స్ట్రీట్, ఫైర్ స్టేషన్, రైల్వే జంక్షన్, శ్రీనివాస సెంటర్, బ్రిడ్జి పేట, బంద్రోతుల వారి వీధి ,రైతు బజార్, అయ్యంగారి వీధి ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న దృశ్యం

ఉండి: జీవితంలో అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరూ ఉన్నత ఆశయాలతో ముందడుగు వేయాలని ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ పేరిష్ పాస్టర్ రైట్ రెవరెండ్ ఎం.మేషక్ సతీష్ కుమార్, అడిషినల్ పాస్టర్ రెవరెండ్ అబ్షాలోమ్‌రాజు అన్నారు. బుధవా రం రాత్రి చర్చ్‌లో పురుష సమాజం ఆధ్వర్యంలో దాత పారుపూని ప్రశాంత్‌కుమార్ ఆర్థిక సహకారంతో 36మంది టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ సీఆర్ పి.కరుణాకర్‌రావు, రెవరెండ్ ఎం అబ్రహం, రంపా వెంకటేష్, కొల్లాబత్తుల కృష్ణ పాల్గొన్నారు.